సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



అర్బన్ పార్క్.. ఆహ్లాదంలో మార్క్

నర్సాపూర్ అడవుల్లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు ఆహ్లాదం పంచడంలో తనదైన మార్క్ చూపిస్తుంది.

వివరాలు IIలో ▸



సిద్దిపేట.. అధ్యయన బాట

రాష్ట్రంలోని 46 మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, శానిటేషన్ అధికారులు సిద్దిపేట బల్దియాలో అధ్యయనం బాట పట్టారు.

వివరాలు IIలో ▸



పేరుకే క్రీడా ప్రాంగణాలు

గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని గ్రామాల్లో ఏర్పాటైన క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలను విస్మరించారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

పెండింగ్ ఫీజు నిధులు విడుదల చేయాలి



నారాయణఖేడ్: ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌కు సంబంధించిన రూ.7,800 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు నారాయణఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్ గ్రౌండ్ నుంచి రాజీవ్ చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల బకాయిలు పేరుకుపోయి పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఫలితంగా విద్యకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిధులను వెంటనే విడుదల చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. సంఘం నారాయణఖేడ్ సంయుక్త కార్యదర్శి శంకర్, నాయకులు విజయ్, పవన్‌రెడ్డి, విగ్నేష్, అభిలాష్, చందు, ప్రశాంత్, నాని, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ప్రమాదాలను ముందుగానే గుర్తించాలి

డాక్టర్ రోషన్ నాయర్

పటాన్‌చెరు: ప్రమాదాలను ముందుగానే గుర్తించి, వాటిని నియంత్రించేలా డిజైన్లను రూపొందించాలని భావి ఇంజనీర్లకు ఆస్ట్రేలియాలోని మోట్ మెక్-డొనాల్డ్ టన్నెల్స్, రవాణా టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ నాయర్ సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో 'సారంగం - భద్రత, రూపకల్పన, సుస్థిరత, స్థిరత్వం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) గీతం విద్యార్థి విభాగం సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులకు డిజైన్లను రూపొందించే సమయంలో ఎదురైన సవాళ్లను, వాటిని అధిగమించేందుకు అమలు చేసిన వినూత్న పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, డాక్టర్ నాయర్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వందన, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సంగారెడ్డిలో విద్యుత్ గ్రీవెన్స్ సెల్

డీఈ సురేందర్ రెడ్డి

సంగారెడ్డి: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సంగారెడ్డి పట్టణంలోని డివిజనల్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ కార్యాలయంలో శనివారం సీజీఆర్ఎఫ్ (కన్జ్యుమర్ గ్రీవెన్స్ రీడ్రాఫెల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు డీఈ ఎ.సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, కరెంటు బిల్లు రసీదు తీసుకోవాలని రావాలని సూచించారు . డివిజన్ పరిధిలోని సంగారెడ్డి, కంది, కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు, అలాగే ఇస్నాపూర్ డివిజనల్ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎస్ఈఈ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, కార్యదర్శి భూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యలను సంస్థ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ కార్మికుల సంక్షేమమే ఎజెండాగా యూనియన్ పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల అధికారులుగా జేఏవో శ్రీదేవి, మంజుల వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీకర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వినోద్, కోశాధికారిగా వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. సమావేశంలో భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం.. సర్కార్ లక్ష్యం

మంత్రి కొండా సురేఖ
- దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభం
- 30 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు: దామోదర



దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ. చిత్రంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

హత్నూర(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నూతనంగా రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి దామోదరతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు అని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తమ ప్రభుత్వం వైద్య, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, తర్వాత వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. సంగారెడ్డి, నర్సాపూర్ ప్రాంతాలకు మధ్య ఉన్న దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్డేట్ చేసే విషయం పరిశీలనలో ఉందన్నారు. వీటికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీజీఐసీసీ చైర్మన్ నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, జిల్లా వైద్యాధికారిని గాయత్రీ దేవి, పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ ఎంపీపీ నర్సింలు, తాజా మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చేయడానికి సమయం లేదా?: ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఫోన్ చేయడానికి సమయం లేదా.. వాట్సాప్ మెసేజ్ పెట్టారు అంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గాయత్రి దేవిపై ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం కోసం మెసేజ్ చేశారు.. ఒక వేళ తాను మెసేజ్ చూసుకోలేకపోతే ఈ కార్యక్రమానికి రాలేకపోయేదాన్ని కదా అన్నారు. మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఫోన్ చేసినా కలవలేదని, ఇలాంటి పొరపాటు మళ్లీ జరగనివ్వనని డీఎంహెచ్ఓ సమాధానం చెప్పారు.

చివరి గింజ వరకూ కొంటాం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నిజాంపేట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రైతులు పండించిన ధాన్యంను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ మండలం తుర్కాపల్లి, హన్మంత్‌రావుపేట్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో, నిజాంపేట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని గుర్తు చేశారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం దొడ్డు రకం ధాన్యంను రూ.2,320కి క్వింటాలు చొప్పున, సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ.2,300 చొప్పున, అదనంగా బోనస్ రూ.500ల చొప్పున చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అందువల్ల రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులకు విక్రయించరాదని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ శోభ, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ సర్పంచు ఈశ్వరప్ప, మాజీ ఎంపీటీసీలు దత్తుగౌడ్, నారాయణ, అశోక్ రెడ్డి, సబిత, శ్యామయ్య, శంకర్ దిరాజ్, రాధాకిషన్ పాల్గొన్నారు.

పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్, నిజాంపేట్, మండలాలకు చెందిన 116 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 37 మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. తమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మాజీద్, నాయకులు మాణిక్యం, తాహెర్, నెహ్రూనాయక్, రమేష్ చౌహాన్, తహసీల్దార్ భాస్కర్ ఉన్నారు.

త్వరలో వైద్య పోస్టుల భర్తీ

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గాయత్రీ దేవి
- అనుమతిలేని ఆస్పత్రులపై చర్యలు



హత్నూర(సంగారెడ్డి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని త్వరలోనే భర్తీ చేస్తామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గాయత్రీ దేవి అన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆమె సాక్షితో మాట్లాడారు. జిల్లాలో 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. అందులో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పనిచేస్తున్నాయని, 13 కేంద్రాలు 12 గంటలు పనిచేస్తున్నాయని తెలిపారు. వీటిలో 56 మందికి గాను ప్రస్తుతం 46 మంది మాత్రమే డాక్టర్లు పనిచేస్తున్నారని తెలిపారు. 10 డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో 246 సబ్ సెంటర్లు ఉండగా.. అందులో ఇద్దరు ఏఎన్ఎంలు పనిచేయాల్సి ఉండగా.. ఒకరు మాత్రమే ఉన్నారని, త్వరలోనే ఇంకొకరిని కూడా నియమించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. 150 మంది స్టాఫ్ నర్సులు అవసరం ఉండగా వంద మంది మాత్రమే పనిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని, త్వరలో వాటిని భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

త్వరలోనే హత్నూర, రామచంద్రాపురం, సంగారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రారంభిస్తామని డీఎంహెచ్ఓ చెప్పారు. ప్రస్తుతం కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఆపరేషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీలు 941 ఉన్నారన్నారు. వీరికి ఎలాంటి అనుమతులు లేవని ఇంజక్షన్లు, గ్లూకోస్లు కానీ రోగులకు పెట్టవద్దని ఆమె సూచించారు. జిల్లాలో ఇప్పటికే 17 అనుమతి లేని ఆసుపత్రులను సీజ్ చేశామని, 172 ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశామని ఆమె తెలిపారు. ఇటీవల రామచంద్రపురంలో ఒక ఆసుపత్రిని సీజ్ చేసి కేసు చేశామన్నారు. ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స చేసి ఇతర ఆసుపత్రులకు పంపించాలని సూచించారు.



స్టేషన్ రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

ఎస్పీ చెన్నూరి రూపేష్

జిన్నారం(పటాన్‌చెరు): నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్ నిరోధానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక వాడలోని వలస కార్మికులు, యాజమాన్యాలకు పోలీసు వ్యవస్థ భరోసాగా ఉండాలన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేకంగా పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ప్రజా పోలీసింగ్ వ్యవస్థకు కృషి చేయాలన్నారు. నిషేధిత మాదకద్రవ్యాలు పాన్ మసాలా గుట్కా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవ రావు, డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ గంగాధర్, ఎస్సై రాములు పాల్గొన్నారు.

నిన్న



దంపు యార్డులో చెత్త

నేడు



శుభ్రంగా మారిన డంప్ యార్డు

డంప్ యార్డు శుభ్రం

- చెత్త సమస్యపై కలెక్టర్ ఆగ్రహం
- వెంటనే తొలగించిన పారిశుద్ధ్య కార్మికులు

సాక్షి స్పందన

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో కాలనీల మధ్య ఉన్న డంప్ యార్డును గురువారం శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్ర పరిచారు. 'డంపు.. కంపు' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పందించారు. కాలనీల మధ్య డంపు యార్డు ఉండటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి చెత్తను వెంటనే తొలగించాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డిని ఆదేశించారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి సాక్షితో మాట్లాడుతూ.. డంప్‌యార్డుతో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెత్తను ఎప్పటికప్పుడు జవహర్‌నగర్‌కు తరలిస్తామన్నారు. పారిశుద్ధ్యం సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. కాగా, చెత్తను తొలగించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

'సీఎంకు గుణపాఠం చెబుతాం'

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మాదిగలను నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయంగా తగిన గుణపాఠం చెబుతామని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్ హెచ్చరించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలో జరిగే విద్యార్థుల సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ నిండు సభలో సమర్థించారని తెలిపారు. వర్గీకరణ అమలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



కందిలోని జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

సంగారెడ్డి టౌన్: ఖైదీల కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. గురువారం కందిలోని జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖైదీలకు సదుపాయాలు కల్పిస్తూ ములాఖత్ అందించాలని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంటశాల, పరిసరాలను పరిశీలించారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచిత సేవలు పొందవచ్చని ఖైదీలకు తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగానే రికార్డులు

- డీడీఎస్ సంస్థను అభాసుపాలు చేసేందుకే కుట్ర
- సంస్థ అధ్యక్షుడు సంజయ్

జహీరాబాద్: నాలుగు దశాబ్దాల కాలంగా డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని సంస్థ అధ్యక్షుడు బి.పి.సంజయ్ అన్నారు. గురువారం పస్తాపూర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యులతో కలసి ఆయన మాట్లాడారు. సంస్థలో పనిచేసి మానేసిన కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డీడీఎస్ కొన్న సంస్థలు ఇచ్చే నిధుల ద్వారా పని చేస్తోందన్నారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయం, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నమన్నారు. సంస్థ ఖర్చుచేసే నిధులతో పాటు కార్యక్రమాల వివరాలను పారదర్శకంగా చూపుతోందన్నారు. సంఘం సభ్యులకు సంబంధించిన జమలను వాడుకున్నారని, భూములను విక్రయించారని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సంస్థలో పనిమానుకున్న వారిలో అప్పులు లేని వారు 825 మంది ఉన్నారని, వారి జమలకు సంబంధించి రూ.5.24లక్షలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. ఇట్టి నిల్వను తిరిగి ఇచ్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. 48 గ్రామాలకు చెందిన సభ్యుల నుంచి డీడీఎస్‌కు రూ.24.19లక్షలు రావాల్సి ఉందన్నారు. సంస్థ డైరెక్టర్‌గా పనిచేసిన పి.వి.సతీష్ మరణానంతరం ఎలాంటి భూముల విక్రయాలు చేయాలని వివరించారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన వ్యక్తి 1993 సంవత్సరంలో డీడీఎస్‌కు రాజీనామా చేశాడని పేర్కొన్నారు. సంస్థను మూసివేయించాలనే ఉద్దేశంతో బయటకు వెళ్లిన వారు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో డీడీఎస్ సభ్యులు అనూషమ్మ, నాగమ్మ, లక్ష్మమ్మ, సూర్యకళ, స్వరూపమ్మ, మొగులమ్మ, చంద్రమ్మ, సరెమ్మ, నర్సమ్మ, పాల్గొన్నారు.

నేల రాలుతున్న తెల్ల బంగారం

- వర్షాలతో పత్తి తీత పనులకు ఇబ్బందులు
- పెట్టుబడులు కష్టమే అంటున్న రైతులు
- మద్దతు ధర కల్పించాలని వినతి



తెంపేందుకు సిద్ధంగా ఉన్న పత్తి పంట

సంగారెడ్డి జోన్: పంట వేసిన నాటి నుంచి చేతికి వచ్చే వరకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. వానాకాలం సీజన్‌లో సాగులో భాగంగా అత్యధికంగా పత్తి పంటనే సాగు చేస్తున్నారు. రుణ భారం ఎక్కువైనప్పటికీ పత్తిని నమ్ముకుని సాగును మాత్రం వీడటం లేదు. సీజన్ ఆరంభంలో సరైన విధంగా వర్షాలు కురవలేదు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిండుగా విరబూసిన పత్తి కురుస్తున్న వర్షాలకు నేలపై రాలిపోతుంది.

- జిల్లావ్యాప్తంగా 6 లక్షల 96 వేల ఎకరాలు సాగు ఉండగా అందులో 3 లక్షల 90 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఒక ఎకరాకు సుమారు రూ.45 వేల పెట్టుబడి ఖర్చులు అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.
- ప్రస్తుతం పంట చేలల్లో దాదాపు పూర్తి స్థాయిలో పత్తి విరబూసింది. పలు చోట్ల పత్తి తెంపే పనులు సాగుతుండగా మరి కొన్ని చోట్ల తెంపేందుకు సిద్ధంగా ఉంది.
- పత్తి పంట కాత దశలో ఉన్న సమయంలో కురిసిన అధిక వర్షాలకు అడుగు భాగంలో ఉన్న పత్తి కాయలు పూర్తిగా రంగు మారి పాడైపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి పంట నేల రాలిపోతుంది.
- విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఇతర పంటల మాదిరిగానే పత్తి పంట మారిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పత్తి తీసే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పత్తి పంట బరువు తగ్గే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.
- పంట సాగుకు చేసిన పెట్టుబడి ఖర్చులు కూడా వస్తాయా లేదో అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పత్తి పంటకు కనీసం మద్దతు ధర రూ. 10వేలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పంట బరువు తగ్గింది



ఒకటిన్నర ఎకరంలో పత్తి పంటను సాగు చేశాను. పెట్టుబడికి రూ.50 వేలకు పైగా ఖర్చు అయింది. అధిక వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతింది. దీంతో సాధారణ కంటే పంట బరువు తక్కువగా వస్తుంది.

–సాయికుమార్, బర్దిపూర్, ఝరాసంగం

పెట్టుబడులు కూడా కష్టమే



ఏడెకరాలలో పత్తి పంటను సాగు చేశా. పంట సాగుకు చేసిన పెట్టుబడి ఖర్చులు రావడం కష్టంగా మారింది. అధిక వర్షాలతో పంటకు తెగుళ్ల సోకటంతో పెట్టుబడులు ఎక్కువయ్యాయి. పత్తి పంటకు కనీస మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేయాలి.

–అబ్దుల్ సత్తార్, బొప్పన్ పల్లి, ఝరాసంగం

క్లుప్తంగా

పోలీసు అధికారులకు వ్యాస రచన పోటీలు



వ్యాసం రాస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపర్చడంలో పోలీసుల పాత్ర, ఎస్‌ఐ స్థాయి నుంచి పై స్థాయి అధికారులకు దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు అనే రెండు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు కేటగిరీల్లో ముగ్గురు చొప్పున ఆరుగురిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు.

ఉత్తమ రైతు అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్ రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): సంగాయిపేట గ్రామానికి చెందిన రైతు, మండల మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి భారతీయ వరి పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్ వారి చేతుల మీదుగా గురువారం ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎన్వీ ఎస్ శాస్త్రీ ఆడిటోరియం, ఐసీఏఆర్–ఐఐఏఆర్‌లో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండా రెడ్డి ఈ అవార్డును అందజేశారు. అవార్డు అందజేయడంపై ఐసీఏఆర్–ఐఐఏఆర్ డైరెక్టర్లు సుందర్ రామ్, షేక్ ఎన్ మీరా, వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాల్లో దొంగతనాలు

ఐదుగురు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్ రూరల్: దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ఏసీపీ కార్యాలయంలో గురువారం గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, తొగుట సీఐ లతీఫ్, కుకునూర్‌పల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన పర్వతం నర్సింలు, మోతె పర్శరాములు, నూనె రమేశ్, మోతె సాధుల్లతో పాటు దుబ్బాక పట్టణానికి చెందిన నూనె సంపత్ కలిసి పలు దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. అలాగే చిన్నకోడూర్ మండలంలోని విఠలాపూర్ గ్రామంలో ఇంటి ఎదుట నిద్రిస్తున్న మహిళ మెడలోంచి పుస్తెల తాడును లాక్కెళ్లారు. 23న కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో రాజీవ్ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా దొంగిలించిన వస్తువులను సిద్దిపేటలో అమ్ముకునేందుకు వెళ్తుండగా బైక్‌పై వెళ్తూ పట్టుబడ్డారు. నిందితులపై పలు స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు. వారి నుంచి రెండు బైక్‌లతోపాటు బంగారం, దేవతల రాతి విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు.

అర్బన్ పార్క్.. ఆహ్లాదంలో మార్క్

పెరుగుతున్న పర్యాటకుల సందడి

- నర్సాపూర్ అడవుల్లో అటవీ శాఖ ఏర్పాటు
- రేంజ్ పరిధిలో 11,600 హెక్టార్లలో విస్తీర్ణం
- అడవి మధ్యలో వాచ్ టవర్ నిర్మాణం
- పార్కు ఆవరణలో పూర్తి కావొస్తున్న కాటేజీలు
- పెరుగుతున్న ఎలుగుబంట్లు, నక్కలు, కుందేళ్లు, నెమళ్ల సంఖ్య



వాచ్ టవర్ వద్ద ట్రైనీ అధికారులు (ఫైల్)


నర్సాపూర్ అడవుల్లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు ఆహ్లాదం పంచడంలో తనదైన మార్క్ చూపిస్తుంది. అర్బన్ పార్క్‌లో రోజు రోజుకూ పర్యాటకుల సందడి పెరుగుతూ వస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో నర్సాపూర్ అడవిలో అర్బన్ పార్కు రూపుదిద్దుకొని పర్యాటకులకు ఆహ్లాద వాతావరణాన్ని పంచుతుంది. అడవి మధ్యలో ఏర్పాటు చేసిన వాచ్ టవర్, కాటేజీల నిర్మాణం, పార్క్‌లోని జంతువులు పర్యాటకులను ఆకర్శిస్తున్నాయి.

– నర్సాపూర్

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే నర్సాపూర్ అడవులకు దట్టమైన అడవులుగా పేరుండేది. అప్పట్లో నర్సాపూర్ అటవీ రేంజ్ పరిధిలో సుమారు 25 వేల హెక్టార్ల అడవులు ఉండేవి. జిల్లాల పునర్విభజనతో నర్సాపూర్ రేంజ్ పరిధిలోని కొంత భాగం సంగారెడ్డి జిల్లాలోకి వెళ్లింది. అటవీ శాఖలో కొత్త రేంజ్‌లు ఏర్పాటు చేయడంతో నర్సాపూర్ రేంజ్‌ను విభజించి దాని పరిధిలో కాడిపల్లిలో కొత్తగా అటవీ శాఖ రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నర్సాపూర్ రేంజ్ పరిధిలో 11,600 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి.

అడవుల సంరక్షణ

కొంతకాలం కిందట కలప వినియోగం ఎక్కువగా ఉండడంతో ప్రజలు అక్రమంగా అడవిలోని చెట్లను నరికి కలపను తమ అవసరాలకు వినియోగించేవారు. వంట చెరకు, కలప పందిళ్ల తగ్గడంతో పాటు ఇళ్లకు ఎక్కువగా కలప వినియోగించే పద్ధతులు వచ్చాయి. అలాగే అడవుల సంరక్షణకు అటవీ శాఖ పలు చర్యలు తీసుకోవడంతో అడవుల్లో చెట్ల నరికివేత తగ్గింది. చెట్లు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకున్నారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీంతో అడవులు నిండుగా తయారవుతున్నాయి.



వాచ్ టవర్‌పై నుంచి కనిపిస్తున్న నర్సాపూర్ రాయరావు చెరువు, పట్టణం

పెరుగుతున్న అడవి జంతువులు

అడవులు దట్టంగా తయారవడంతో రేంజ్ పరిధిలో చిరుత పులులు ఉండి ఉంటాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ అవి ఎన్ని ఉన్నయో స్పష్టమైన లెక్కలు లేవని అంటున్నారు. వాటితో పాటు వందల సంఖ్యలో సాంబార్, జింకలు ఉన్నాయి. కాగా ఎలుగుబంట్లు, నక్కలు, కుందేళ్లు, నెమళ్ల సంఖ్య చాలా పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

నిత్యం పర్యాటకుల సందడి



అర్బన్ పార్క్ ఎంట్రెన్స్ వద్ద పర్యాటకులు

స్థానిక అర్బన్ పార్క్‌ను చూసేందుకు రోజూ పర్యాటకులు వస్తుంటారు. పార్క్‌లోకి వెళ్లేందుకు అటవీ శాఖ పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 చార్జ్ వసూలు చేస్తుంది. మామూలు రోజుల్లో 60 నుంచి 80 మంది పర్యాటకులు వస్తుండగా సెలవు రోజుల్లో 130 నుంచి 150 మంది పర్యాటకులు రావడంతో అంతా సందడిగా ఉంటుంది. అర్బన్ పార్క్ ఆవరణలో అటవీ శాఖ కాటేజీల నిర్మాణం చేపట్టింది. మొదటి దశలో నిర్మాణం చేపట్టిన కాటేజీల పనులు చివరి దశకు వచ్చాయి. మరిన్ని కాటేజీల నిర్మాణం పనులు చేపట్టారు. ఇవి అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని. పార్క్‌కు అప్పుడప్పుడు ఆయా శాఖల ఉద్యోగులను తీసుకొస్తుంటారు. అటవీ శాఖకు చెందిన ట్రైనీ అధికారులతోపాటు ఇతర శాఖల అధికారులను తీసుకొచ్చి అడవుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, పార్క్ నిర్వహణపై అవగాహన కల్పిస్తుంటారు.

కనువిందుగా వాచ్‌టవర్

మాజీ సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా అడవిలో అర్బన్ పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు వినియోగంలోకి తెచ్చారు. ఇందులో వాచ్ టవర్ నిర్మించారు. మెయిన్ రోడ్డు నుంచి వాచ్ టవర్ వరకు వెళ్లేందుకు అడవిలో మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. వాచ్ టవర్‌పై నుంచి ఒక వైపు చూస్తే నర్సాపూర్ పట్టణంతో పాటు పట్టణానికి చెందిన రాయారావు కనువిందు చేస్తుంది. మరో వైపు నర్సాపూర్ హైద్రాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు కనిపిస్తాయి. మిగిలిన వైపు ఎటు చూసినా కనుచూపు మేర దట్టమైన ఆకు పచ్చని చెట్లతో నిండిన అడవి పర్యాటకులకు కనువిందు చేస్తుంది.



నర్సాపూర్ అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వాచ్‌టవర్, చుట్టూ అటవీ ప్రాంతం

నిరంతరం పర్యవేక్షణ



నర్సాపూర్ రేంజ్ పరిధిలోని అడవులను సంరక్షించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఏర్పాటు చేసిన కంచె, కందకాలను ధ్వంసం చేయకుండా పర్యవేక్షిస్తూ అడవులను కాపాడే పనులు నిరంతరం చేపడుతున్నాం. అర్బన్ పార్క్‌లో తాగు నీటి వసతి కల్పిస్తున్నాం. మెయిన్ రోడ్డు నుంచి అర్బన్ పార్కుకు వెళ్లే దారిలో తమ సెక్యూరిటీ గార్డులతో పర్యవేక్షణ చేపడుతున్నాం. అడవులు చిక్కగా ఉండటంతో పర్యాటకులు పార్క్‌లో ఆనందంగా గడుపుతున్నారు.

– అరవింద్, నర్సాపూర్ ఎఫ్‌ఆర్‌ఓ

ఆటో బోల్తా : ఒకరు మృతి

మరొకరికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని సీతానగర్ గ్రామానికి చెందిన నాగయ్య, చిన్నోళ్ల వెంకయ్య (60) పెద్దశంకరంపేటలో గురువారం వారాంతపు సంతకు వెళ్లారు. తిరిగి సీతానగర్ గ్రామానికి ఆటోలో వస్తుండగా రాంపూర్ గ్రామ శివారులోకి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నాగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.

పాదచారిని ఢీకొని బైకిస్ట్..

వర్గల్(గజ్వేల్): రోడ్డు దాటుతున్న పాదచారిని బైక్ ఢీకొనగా బైకిస్టు మృతిచెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం వద్ద చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మర్కూక్ మండలం పాముల పర్తికి చెందిన నీల కరుణాకర్(29) ఒంటి మామిడి సమీప కంపెనీలో ప్రైవేటు ఉద్యోగి. బుధవారం రాత్రి డ్యూటీ ముగించుకొని బైక్‌పై ఇంటికి తిరిగొస్తున్నాడు. గౌరారం వద్ద రాజీవ్ రహదారిపై ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డు దాటుతున్న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన దీపక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా కరుణాకర్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లీ, ఇద్దరు కొడుకుల రిమాండ్

కౌడిపల్లి(నర్సాపూర్): పంట రక్షణ కోసం వేసిన విద్యుత్ తీగ తగిలి మహిళతోపాటు రెండు మేకలు మృతి చెందిన విషయమై నిర్లక్ష్యం వహించిన తల్లీ, ఇద్దరు కొడుకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. జాజితండాలో పంట రక్షణ కోసం వేసిన కరెంట్ తీగ ఉదయం 11 గంటలైన తీయకుండా నిర్లక్ష్యం వహించడంతో కరెంట్ షాక్‌కు గురై కాట్రోత్ బుజ్జితోపాటు రెండు మేకలు మృతి చెందిన విషయం విధితమే. మృతురాలి భర్త సేవ్యనాయక్ ఫిర్యాదు మేరకు పంట యజమాని పాత్‌లోత్ శోభ ఆమె ఇద్దరు కొడుకులు రమేశ్, నరేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పంటల రక్షణ కోసం కరెంట్ తీగలు వేసి నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



మహేందర్‌రెడ్డి (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): పురుగు మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వంగ మహేందర్ రెడ్డి(56) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం వరి చేనుకు మందు పిచికారీ చేద్దామని భార్యను బైక్‌పై తీసుకెళ్లి పొలం దగ్గర దింపాడు. అనంతరం మందు డబ్బా తీసుకొస్తానని ఇంటికి వెళ్లి పురుగు మందు తాగాడు. ఇది చూసిన మహేదర్ తల్లి ఇరుగు, పొరుగు వారి సాయంతో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి కుమారుడు వంగ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మహేందర్ రైతు రుణమాఫీ కాలేదని ప్రతి రోజూ ఆవేదన చెందేవాడని, మాఫీ జరిగి ఉంటే ఆత్మహత్య చేసుకునే వాడు కాదని గ్రామస్తులు చెప్పుకొచ్చారు.

గడ్డి మందు తాగి



శ్రీనివాస్ (ఫైల్)

దుబ్బాకరూరల్: గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మతి చెందాడు. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన పంజ శ్రీనివాస్(49)కు ఆరు నెలల కిందట గుండె ఆపరేషన్ అయ్యింది. అప్పటి నుంచి కల్లు, మద్యం తాగకూడదని వైద్యులు తెలిపారు. అయినా తాగడంతో భార్య రాజమణి మందలించింది. దీంతో గొడవపడి 22న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పొలం వద్ద గడ్డి మందు తాగి పడిపోయాడు. మరుసటి రోజు ఉదయం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పొలం వద్ద కొట్టంలో కనిపించాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమ విఫలమై యువకుడు

సిద్దిపేటకమాన్: చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం మోచి గల్లికి చెందిన బోధనకారి జయమ్మ, లక్ష్మీనారాయణ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు విశ్వసాయి (22) ఉన్నారు. విశ్వసాయి స్థానికంగా ఓ మొబైల్ షాపులో సెల్ రిపేర్ వర్క్ చేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతితో ప్రేమలో ఉన్నాడు. 15 రోజులుగా మనస్తాపంతో ఉంటూ తనకు బతకాలని లేదని, చనిపోతానని తల్లిదండ్రులకు చెప్పాడు. బుధవారం రాత్రి ఇదే విషయం ఇంట్లో వారికి మళ్లీ చెప్పడంతో కోపడ్డారు. కొద్దిసేపటికే దుకాణానికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. నేను కోమటి చెరువులో దూకి చనిపోతున్నానంటూ విశ్వసాయి స్నేహితుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పెట్టాడు. వెంటనే స్నేహితుడు విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా వారు వెళ్లేలోపు చెరువులో దూకాడు. గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీసి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమారుడు ప్రేమ విఫలమై చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


కుటుంబ కలహాలతో వ్యక్తి

చేగుంట(తూప్రాన్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేట మండలం పులిగుట్ట తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. తండాకు చెందిన మాలోత్ నర్సింహ మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. తండా వాసులు, కుటుంబీకులు పలు మార్లు మందలించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే గురువారం తెల్లవారుజామున ఇంటి సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో ఉరేసుకొని భార్య

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమగోదావరికి చెందిన సునీత(44) కుటుంబం బతుకుదెరువు కోసం వచ్చి ఐలాపూర్ గ్రామంలో ఉంటున్నారు. భర్త అశోక్ సివిల్ కాంట్రాక్టర్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. పని చేసేచోట ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం తెలిసిన భార్య అశోక్‌ను నిలదీయడంతో తల్లిగారి ఇంటికి పంపించాడు. భర్త తీరు మార్చుకోకపోవడంతో మనస్తాపం చెందిన సునీత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హన్మంతు

ఝరాసంగం(జహీరాబాద్): అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు వెల్లడించారు. గురువారం మండల కేంద్రం ఝరాసంగం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నరేశ్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని బొప్పన్‌పల్లి గ్రామానికి చెందిన అనిల్ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి నిషేధిత ఎండు గంజాయి బైక్‌పై తీసుకొస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం రాత్రి బర్దీపూర్ గ్రామ శివారులో ఝరాసంగం ఎస్‌ఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. అనిల్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా సీట్ కవర్ కింద గంజాయి దొరికింది. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా బీదర్ ప్రాంతానికి చెందిన పునీత్, జాఫర్ అలీల నుంచి గంజాయి తీసుకొచ్చి సేవించడంతోపాటు బొప్పన్‌పల్లితోపాటు పరిసర ప్రాంత ప్రజలకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద రూ.32,300 విలువ చేసే కేజీ 295 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. బీదర్‌లో అమ్ముతున్న వారు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఏఎస్‌ఐ మల్లేశంతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

టెంట్ హౌస్ దగ్ధం

రూ.30 లక్షల నష్టం



వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

కంగ్టి(నారాయణఖేడ్): ప్రమాదవశాత్తు టెంట్ హౌస్ దగ్ధమైన ఘటన కంగ్టి మండలం నాగన్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బిరాదర్ శివాజీరావు పాటిల్‌కు చెందిన టెంట్‌హౌస్‌లో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. నారాయణఖేడ్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పేశారు. అప్పటికే సామగ్రి వరకు కాలిబూడిదైంది. గురువారం కంగ్టి తహసీల్దార్ అబ్దుల్ నజీం ఖాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించి బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీరించారు. రూ.30 లక్షల నష్టం వాటిల్లినట్లు శివాజీరావు ఆవేదన వ్యక్తం చేశాడు.

అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

- మరో ముగ్గురు పరారీలో
- రూ.12.50 లక్షల విలువ చేసే 50 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్.. కీలక సూత్రధారి భారీగా గంజాయి తరలిస్తుండగా బీడీఎల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీడీఎల్ సీఐ స్వామి గౌడ్, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డిలతో కలిసి డీఎస్పీ రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బాల్కికి చెందిన మల్లేశ్ జాదవ్ (23)తోపాటు మరో ముగ్గురు ఒరిస్సా మల్కాన్‌గిరి నుంచి మహారాష్ట్ర వైపు రెండు కార్లు, బైక్‌పై ఎండు గంజాయి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూర్ గ్రామ శివారులో ఓఆర్ఆర్ అండర్ బ్రిడ్జ్ వద్ద బీడీఎల్ భానూర్ సీఐ స్వామి గౌడ్ వాహనాల తనిఖీ చేపట్టారు. పాటి గ్రామం వైపు నుంచి వస్తున్న మల్లేశ్ జాదవ్ కారును తనిఖీ చేయగా 25 ప్యాకెట్స్‌లలో 50 కిలోల ఎండు గంజాయి లభించింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ రూ.12 లక్షల 50 వేలు ఉంటుందని వెల్లడించారు. అయితే, వెనుకాలో కారు, బైక్‌పై వస్తున్న దాదా పాటిల్, ప్రవీణ్, బీదన్ పోలీసులను చూసి పరారయ్యారు. పట్టుబడిన మల్లేశ్‌ను గురువారం రాత్రి రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న ముగ్గురిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

సిద్దిపేట.. అధ్యయన బాట



చెత్త పునర్వినియోగం గురించి తెలుసుకుంటున్న ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు

మున్సిపాలిటీలో కమిషనర్ల టూర్


- దశల వారీగా 46 మంది అధికారులు
- వినూత్న ప్రక్రియల గురించి ఆరా
- స్వచ్ఛ బడి నిర్వహణపై ఆసక్తి
- చెత్త పునర్వినియోగంపై అధ్యయనం
- డంప్‌యార్డులో అధికారుల భోజనాలు

సిద్దిపేటజోన్: రాష్ట్రంలోని 46 మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, శానిటేషన్ అధికారులు సిద్దిపేట బల్దియాలో అధ్యయనం బాట పట్టారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి గౌతమ్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు గురువారం బోధన్, ఆర్మూర్, భీంగల్, సిరిసిల్ల, వర్ధన్నపేట, నర్సంపేట, జనగామ, చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ మున్సిపాలిటీ కమిషనర్లతో కూడిన అధికారులు పట్టణంలో పర్యటించారు. కొన్నేళ్లుగా సిద్దిపేట మున్సిపాలిటీ వినూత్న రీతిలో చేపట్టిన ప్రక్రియలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి గురించి ఆరా తీశారు. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ బడిని సందర్శించారు. ఇంట్లోని తడి, పొడి చెత్తను పునర్వినియోగం చేయడం, చెత్త ప్రాముఖ్యత గురించి డిజిటల్ తరగతుల నిర్వహణ పరిశీలించారు. ఈ ప్రక్రియ అద్భుతంగా ఉందన్నారు. వినూత్న రీతిలో అక్కడే డంప్‌యార్డులో అధికారులు భోజనాలు చేశారు.

నిరుపయోగ వస్తువులతో ఇటుకల తయారీ

అంతకుముందు స్థానిక 43 వార్డులో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ ప్రక్రియ, ప్రజల సహకారం, తడి, పొడి, హానికర చెత్త విభజన తదితర అంశాలపై మహిళలతో ఆరా తీశారు. చెత్త వేరు చేయు విధానాన్ని విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం బుస్సపూర్ డంప్‌యార్డు సందర్శించారు. తడి చెత్త ద్వారా బయోగ్యాస్ తయారీ, బయో మైనింగ్ ప్రక్రియ, మానవ మల వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్, ప్లాస్టిక్ నిరుపయోగ వస్తువులతో ఇటుకల తయారీ ప్రక్రియలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్‌లోని పొడి చెత్త సేకరణ కేంద్రం సందర్శించి పనితీరు తెలుసుకున్నారు. వార్డు స్థాయి కంపోస్టు యార్డ్, కోమటి చెరువును సందర్శించారు. వీరికి మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, సిద్దిపేట కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పట్టణంలో అమలవుతున్న వినూత్న ప్రక్రియలను వివరించారు. సిద్దిపేటను సందర్శించి కమిషనర్లలో వెంకట్ నారాయణ (బోధన్), రాజు (ఆర్మూర్), జోనా (నర్సంపేట,వర్ధన్నపేట), వెంకటేశ్వర్లు (జనగామ), రామకృష్ణ (భీంగల్) రమేశ్(దుబ్బాక), నాగేందర్(చేర్యాల), నర్సయ్య(గజ్వేల్), మల్లికార్జున్(హుస్నాబాద్) ఉన్నారు.


మా దగ్గర అమలు చేసేందుకు



సిద్దిపేట బల్దియాలో అమలు చేస్తున్న వినూత్న ప్రక్రియలను మా మున్సిపాలిటీలో అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తాం. స్వచ్ఛ బడి అనే ఆలోచన వినూత్నమైంది. చెత్త ప్రాముఖ్యత గురించి డిజిటల్ క్లాస్ తరహాలో బోధన చేసి సంపూర్ణ అవగాహన కల్పించే ప్రక్రియ బాగుంది.

– వెంకట్, నారాయణ బోధన్ కమిషనర్


మరింత మార్పు కోసం..



ప్రస్తుతం మా మున్సిపాలిటీలో అమలు చేస్తున్న వాటికి భిన్నంగా మరింత మార్పు కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర మున్సిపాలిటీల్లో అధ్యయనం చేస్తున్నాం. సిద్దిపేటలో చూసిన వాటికి కొంత అదనంగా క్రోడీకరించి మా పట్టణంలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తాం.

–రాజు, ఆర్మూర్

సిద్దిపేట కీర్తిని కాపాడుతాం



సిద్దిపేట మున్సిపాలిటీకి ఉన్న కీర్తిని కాపాడే ప్రయత్నాలు చేస్తాం. ఇక్కడకు అధ్యయనం కోసం ఇతర మున్సిపాలిటీల అధికారులు రావడం సంతోషం. అవకాశం ఇచ్చిన మున్సిపల్ డైరెక్టర్ గౌతమ్ సర్‌కు కృతజ్ఞతలు.

–ఆశ్రిత్ కుమార్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్